ఢిల్లీ లో జరిగిన 42వ ట్రాన్స్పోర్ట్ డెవలప్మెంట్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి రాంప్రసాదరెడ్డి

వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 08 జనవరి 2025

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం

మదనపల్లి క్రైమ్, జనవరి 7 ప్రభాతవార్త.

ట్రాక్టర్ ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగిందని తాలూకా సిఐ కలవెంకటరమణ తెలిపారు.బసినికొండ కు చెందిన గోపాలు కుమారుడు పెయింటర్ నరేష్ (30) తన స్నేహితులతో కలిసి రామాచర్లపల్లెకు బైకులో వెళుతుండగా, నిమ్మనపల్లె రోడ్డు, ఆంజనేయస్వామి గుడి వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు

మద్యం మత్తులో.... ఉన్మాదం

రక్షణ ఇవ్వాల్సిన ఇంటి పెద్దే కాలయముడైన వైనం... భార్యను,కన్న బిడ్డను గొంతు కోసి హత్య

పులివెందుల, జనవరి 7, ప్రభాతవార్త :

మధ్యంకు బానిస అయి మద్యం మత్తులో ఉన్మాదంగా వ్యవహరించి, జీవితాంతం తోడుగా ఉండాల్సిన కట్టు కున్న భర్తే ఆమె పాలిట కాలయముడు అవగా, జన్మ ఇచ్చిన కన్న తండ్రే గొంతు కోసి హత్య చేసిన సంఘటన నియోజకవర్గంలోని తొండూరు మండలంలో చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి నియోజకవర్గం లోని తొండూరు మండలం తేలూరు తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గంగాధరరెడ్డి మద్యం మత్తులో భార్య శివలక్ష్మి (37) కుమార్తె గంగోత్రి (14)లను గొంతు కోసి హతమార్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నిందితుడు గంగాదర్ రెడ్డి ని అదుపులోకి తీసుకుని స్టేషన్ కి తరలించారు. వివరాల్లోకి వెళితే గంగాధర రెడ్డి కుటుంబం ఇదే మండలానికి చెందిన సైదాపురం గ్రామం నుంచి తేలూరు తుమ్మల పల్లెకు వలస వచ్చి వ్యవసాయ కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గంగాధర్ రెడ్డి పూర్తిగా మధ్యానికి బానిస అయ్యాడు. ఇతని భార్య శివలక్ష్మి అంగన్వాడీ కేంద్రంలో ఆయా గా పని చేస్తూ వుండేది. కుమార్తె గంగోత్రి 9 వ తరగతి చదువుతూ డ్రాప్ అయింది. ప్రతి రోజూ గంగాధర్ మద్యం మత్తులోనే వుండేవాడు. సోమవారం కూడా ప్రతి రోజూ మాదిరిగానే మద్యం మత్తులో వున్న గంగాధర నిద్రిస్తున్న భార్యను కూతురిని రాడ్ తో కొట్టి కొడవలితో గొంతు కోసి హత్య చేశాడు. మొదట కూతుర్ని రాడ్ తో కొట్టినట్టు ఎందుకు కొడుతున్నావు అని అడిగిన భార్యను కూడా రాడ్ తో కొట్టి కొడవలితో గొంతు కోసి చంపినట్టు పోలీస్ లకు తెలిపినట్టు సమాచారం. గ్రామంలో ఇలా చేయడం బాధకరం అని గంగాధర్ ను కఠినంగా శిక్షించాలి అని గ్రామస్తులు కోరుతున్నారు. విషయం తెలిసిన వెంటనే తెదేపా నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి అక్కడకు చేరుకుని ఘటన పై ఆరా తీశారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం పులివెందులలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన పై కేసు నమోదు చేశామని విచారణ చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు.

బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలి

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, జనవరి 7ప్రభాత వార్త

బీసీ మరియు ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి అందించే రుణాలకు బ్యాంకర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ జామకూరి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రత్యేక జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధ్యక్షతన, జిల్లా బీసీ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ బీసీ కార్పొరేషన్ మరియు వివిధ బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందించబడే వివిధ రకాల రుణాలు, 202425 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ కు మరియు కమిటీ సభ్యులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు 34 కోట్ల రూపాయలను బీసీ కార్పొరేషన్, ఈ బీసీ, ఆర్థికంగా వెనుకబడిన కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించేందుకు లక్ష్యాన్ని నిర్దేశించిందని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలను పొందేందుకు లబ్ధిదారులు ఈనెల 8 నుంచి 16 లోపల ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏపీ ఓబి ఎంఎంఎస్ మరియు జనరిక్ ఫార్మసీస్ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందించబడే బ్యాంకు లోన్ మరియు సబ్సిడీ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బీసీ కార్పొరేషన్లను మరియు ఆర్థికంగా వెనుకబడిన వివిధ వర్గాల వారి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వ మరియు ప్రైవేటు బ్యాంకు వారు సహకరించాలని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలోని బ్యాంకింగ్ సేవలందించే వారందరూ ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ వర్గాల వారికి రుణాలను త్వరగా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను మార్చి 10 లోపల పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను మరియు బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎల్డిఎం ఆంజనేయులు, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల ముందే నరకం చూపిస్తున్నారు!!

రాష్ట్రంలోనే చెత్త జాతీయ రహదారి 'కడప-రేణిగుంట'... రూ.2254 కోట్లతో కొత్త రహదారి ప్రారంభించకముందే ఇలానా?

రాజంపేట అర్బన్, జనవరి 07, ప్రభాతవార్త:

ఇదేంటి రెండేళ్ల ముందే నరకం చూపిస్తున్నారని అనుకుంటున్నారా? నిజమే మరి. రెండేళ్లలో కొత్త జాతీయ రహదారి వస్తుందని ముందే వాహణదారులకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్హెచ్ఏఐ) చుక్కలు చూపిస్తోంది. 'ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం' సామెత చందాన కొత్త రహదారి రూ.2254కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం చేపట్టిన ఇంతవరకు అతీలేదు..గతీ లేదు. పాత రహదారి నిర్వహణపై ఎన్హెచ్ఏ చేతులెత్తేసింది. ప్రతి రోజు వేలాది వాహణదారులు ఈ చెత్త రహదారిని చూసి జాతీయ రహదారి కూడ ఇంద దరిద్రంగా ఉంటుందా అంటున్నారు. వివరాల్లోకి వెళితే....ఉమ్మడి కడప, తిరుపతి జిల్లాల మధ్య 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎన్హెచ్ఏ రూ.2245కోట్ల వ్యయంతో కడప-రేణిగుంట మధ్య 122కిలో మీటర్ల గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణాన్ని చేపట్టింది. రెండేళ్లలోపు ఈ ఎక్స్ప్రెస్ హైవేని పూర్తి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడంతో పనులు చేజిక్కించుకున్న లక్ష్మీ ఇన్ ప్రా సంస్థ రెండేళ్ల పాటు సైలెంట్ అయిపోయింది. కొత్త రహదారి పనుల టెండర్లు పూర్తయినప్పటి నుంచి పాత రహదారిని ఎన్హెచ్ఏ వదిలేసింది. ఫలితంగా ఈ రహదారి అధ్వాన్నంగా మారింది. ముఖ్యంగా గత రెండు, మూడు నెలలుగా కురిసిన వర్షాలతో జాతీయ రహదారి పరిస్థితి మరింత దారుణమైంది. ముఖ్యంగా రాజంపేట మండలంలోని కొత్త బోయపపల్లె నుంచి రహదారి నరకప్రాయంగా మారింది. ఎందరినో బలిగొంది. మోకాలి లోతు గుంతలతో వాహణదారుల కష్టాలు అన్ని ఇన్ని కావు. ఎగ్జిబిషన్లలో ఏర్పాటుచేసే 'బ్రేక్ డ్యాన్స్' లాగా డ్రైవర్లు జాతీయ రహదారిపై గుంతలను తప్పించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో పెద్దఎత్తున ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త బోయనపల్లె వద్ద మోకాటి లోతు గుంతలతో ప్రమాదాలు జరగడంతో రాజంపేటకు చెందిన బీజేపి నంద్యాల జిల్లా పార్టీ అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు స్వయంగా గ్రావెల్ వేసి గుంతలు పూడ్చి నిరసన తెలిపారు. అయినా ఎన్హెచ్ఏ స్పందించలేదు. కూటమి ప్రభుత్వం నేతలు రహదారి ఇంత దరిద్రంగా ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదు. స్వయంగా రాష్ట్ర రోడ్లు భవణాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ మంత్రిగా ఉన్న స్పందించిన దాఖలాలు లేవు. గత నెల 28న వైసీపీ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి, కడప నుంచి రేణిగుంట విమానాశ్రయం వెళ్లేందుకు ఈ దారిలో వెళ్లారు. జాతీయ రహదారి దుస్థితి చూసి వెంటనే స్పందించి ఎన్హెచ్ఏ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేష్తో ఏమిటీ ఈ పరిస్థితి అని మాట్లాడారు. రోడ్డు ఇంత దారుణంగా ఉంటే పట్టించుకోకపోతే ఎలా అని మండిపడ్డారు. అయినా ఇప్పటి వరకు దిక్కు లేదు. ప్రతిరోజు వేలాది వాహణాలు తిరిగే ఈ రహదారి పట్ల ఎన్హెచ్ఏ నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది. కొత్త రహదారి పనులు ప్రారంభించకమునుపే పాత రహదారి నిర్వహణను పట్టించుకోకుండా చేతులెత్తేస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఎన్హెచ్ఏ స్పందించి 716 జాతీయ రహదారిలో నిర్వహణ పనులు చేపడుతుందో లేదో వేచిచూడాల్సిందే.

జిల్లాలో షెడ్యూల్ తెగల అభివృద్ధికి పక్కాగా

కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

రాయచోటి జనవరి 7ప్రభాత వార్త

జిల్లాలో గిరిజనులు మరియు వారి నివాస ప్రాంతాల అభివృద్ధికి పక్కాగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో... కేంద్ర ప్రభుత్వ ప్రాయోజత కార్యక్రమం మంతన్ శివిర్ లో భాగంగా జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ధర్తీ ఆభా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభయాన్ క్రింద జిల్లా మంతన్ సివిర్ సమావేశం నిర్వహించాలని భారత ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది అన్నారు. ఈ కార్యక్రమం కింద గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. 25 అంశాలలో గిరిజనులు, వారి ప్రాంతాలను అభివృద్ధి చేయాలని 17 శాఖలకు నిర్దేశం చేయడం జరిగిందన్నారు. ప్రతి శాఖ రాబోయే ఐదు సంవత్సరాలలో షెడ్యూల్ తెగల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక కింద ఎస్టీలకు కేటాయించిన నిధుల ద్వారా నిర్దిష్ట కాల పరిమితిలో పథకాల అమలును పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు అన్నమయ్య జిల్లాలో 50 శాతానికి పైబడి గిరిజనుల జనాభా ఉన్న పెనగలూరు కోడూరు లక్కిరెడ్డిపల్లి కురబలకోట 4 మండలాలలో 17 గ్రామాలు పథకాల సంతృప్త అమలుకు ఎంపిక చేయబడినట్లు పేర్కొన్నారు. నాలుగు మండలాల పరిధిలో గల 17 గ్రామాలలోని సచివాలయాల్లో ఆయా పంచాయతీల వారీగా ఎస్టీ గృహాలు, వారి జనాభాను గుర్తించి రెండు రోజుల్లోగా పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు సదరు వివరాలను సంబంధిత లైన్ శాఖలకు అందజేయాలన్నారు. సదరు శాఖల అధికారులు వివరాల మేరకు ఎవరెవరికి ఏయే స్కీములు అందుతున్నాయి, పథకాలు అందాల్సిన వారి వివరాలను వారం రోజుల్లోగా పరిశీలన చేసి నివేదికలను రూపొందించాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఆయా అంశాలలో తదుపరి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారి, ఆర్అండ్బి, పంచాయితీ రాజ్, ఆర్డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యం, డిఆర్డిఏ, డ్వామా, పంచాయతీ, ఐసిడిఎస్, ఫిషరీస్ తదితర శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎంపీ పీఏ రాఘవ రెడ్డి పోలీస్ స్టేషన్కు తీసుకు వెళ్లిన పోలీసులు

అరెస్టు చేస్తారన్న ఊహాగానాలతో భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు

ఈ నెల 9 మ హాజరు కావాలని నోటీసులు జారీ

పులివెందుల, జనవరి 7, ప్రభాతవార్త :

కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని పోలీస్ స్టేషన్కు పట్టణ సిఐ నరసింహులు, పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ రమ్మన్నారని తీసుకెళ్లారు. అరెస్ట్ చేశారు అన్న వదంతులు రావడంతో భారీగా వైసీపీ శ్రేణులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం పులివెందుల పట్టణ తన నివాసం నుంచి పోలీస్ వాహనంలో ఎక్కించుకొని స్టేషన్కు తీసుకువెళ్లారు. వర్రా రవీంద్రారెడ్డి కేసులో రాఘవరెడ్డి పై అర్బన్ పోలీస్ స్టేషన్ లో రెండు కేసులు నమోదయ్యాయి. 408/24 కేసులో 20వ ముద్దాయిగా రాఘవరెడ్డి ఉండగా ఈ కేసు లో ఈనెల 23వ తేదీ వరకు హైకోర్టు బెయిల్ ఇచ్చింది. మరో కేసు 411/24 నందలూరు లో నమోదైన జీరో ఎఫ్ ఐ ఆర్ ను పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. ఇందులో రాఘవరెడ్డి ముద్దాయి కాదని పోలీసులే న్యాయస్థానానికి తెలిపారు. పోలీసుల విచారణలో వర్రా కీలక విషయాలు వెల్లడించిన విషయం విధితమే. వై.ఎస్ విజయమ్మ, వై.ఎస్ షర్మిలారెడ్డి, ఎన్ సునీతారెడ్డి ల పై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాలని ఎం.పి వై.ఎస్ అవినాష్ రెడ్డి పి.ఏ రాఘవరెడ్డి కంటెంట్ ఇస్తేనే తాను పోస్టు చేసినట్లు అంగీకరించారు. వ్యక్తి హసనానికి పాల్పడేలా ఎం.పి వై.ఎస్ అవినాష్ రెడ్డి చెబుతుంటే దానిని పి.ఏ డైరీలో రాసుకున్నారని వర్ర విచారణలో వెల్లడించారు. పలుమార్లు రాఘవరెడ్డిని విచారించిన పోలీసుల అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని పులివెందుల డిఎస్పి మీడియా సమావేశంలో చెప్పడం జరిగింది. హైకోర్టులో రాఘవరెడ్డి దాఖల చేసిన బెయిల్ పిటిషన్ ను హైకోర్టు రద్దు చేసింది. దీంతో పోలీసులు విచారణకు పిలవకుండానే పోలీసులే ఇంటి దగ్గరికి వెళ్లి తీసుకోవడంపై ప్రాధాన్యత సంతరించుకుంది. రాత్రి 8:30 గంటలకు 41 ఏ నోటీసులు ఇచ్చి ఈ నెల 9వ తేదీన కడప సైబర్ బ్రాంచ్ పోలీస్ స్టేషన్ లో హాజరుకావాలని తెలపడం జరిగింది. దీంతో వైసీపీ శ్రేణులు నెలకొన్న ఉత్కంఠ తగ్గింది.

రెవెన్యూ సదస్సులతో పరిష్కారం

రాజుపాళెం, జనవరి 07. ప్రభాతవార్త.

రైతులు భూసమస్యలను ప్రభుత్వం నిర్వహించు రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకొనుటకు మంచి అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో మంగళవారం తాసిల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెలే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని తెలిపారు. ఇటీవల రైతులు ఎదుర్కొంటున్న ఇనాం భూసమస్యలు,కొన్ని గ్రామాలలో రిజిస్ట్రేషన్ల నిలుపుదల,జాయింట్ఎల్పిలు వంటి సమస్యలకు పరిష్కారం కోసం జాయింట్ కలెక్టర్కు ఫోన్ చేసి వివరించారు.తాసిల్దార్ వెంకటేశ్వర్లు తో చర్చించి మండల పరిధిలోనే పరిష్కారం అయ్యేవాటిని త్వరగా పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని తెలిపారు.సమస్యలనను పరిష్కరించుటకు అధికారులకు రైతులు కూడా సహకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రతాప్, డిప్యూటి తాసిల్దార్ మనోహర్రెడ్డి,ఆర్ఐ హాశేన్రెడ్డి,సర్వేయర్ విజయభాస్కర్,విఆర్ఓలు అశోక్,జయన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే ఇద్దరు మహిళలు

నకిలీ బంగారంతో మోసం

నగల దుకాణం యజమానికి 1.50 లక్షలు బురిడీ

రాజంపేట అర్బన్, జనవరి7 ప్రభాతవా ర్త

రాజంపేట పట్టణంలో ఓ నగల దుకాణం యజమానికి నకిలీ బంగారు ఇచ్చి ఇద్దరు మహిళలు మోసం చేశారు. తీరా వారు వెళ్ళిన తర్వాత చూసుకుంటే అది నకిలీ బంగారిని తేలింది. 1.50 లక్షలు మోసపోయానని నగల దుకాణం యజమాని లబోదిబోమంటున్నాడు. సీసీటీవీలో ఇద్దరు మహిళలు ఉన్నారు. సాయినగర్లో పట్ట పగలు చోరీ...రాజంపేట పట్టణం సాయినగర్ లో పట్ట పగలే దొంగలు పడ్డారు ప్రభుత్వ ఉపాధ్యాయులు గా పని చేస్తున్న నాగరాజు,లక్ష్మి ఇళ్లలో చోరీ చేశారు. ఉద్యోగాలకు వెళ్లిన సమయంలో దొంగలు చోరబడి ఇంటి తలుపులు పగలగొట్టి 15 తులాల బంగారం, నగదు చోరీ చేశారు.ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని గుర్తించడంలో గురువులే కీలకం

స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ పి.శంకర్

రాజంపేట అర్బన్, జనవరి7 ప్రభాతవార్త

నేటి పోటీ ప్రపంచములో విద్యార్థులు తమ ప్రతిభపాఠావాలతో పాటు భాషా పరిజ్ఞానము నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. పట్టణములోని శ్రీ వైష్ణవి డీగ్రీ కళాశాలలో మంగళవారం సాయంత్రం కళాశాల విద్యార్థులకు జాతీయ సమైక్యత వ్యక్తిత్వ వికాసము నైపుణ్యము జరిగిన సమావేశములో డాక్టర్ శంకర్ మాట్లాడుతూ భిన్నత్వములో ఏకత్వము కల దేశము మన భారత దేశమన్నారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థులు దేశభక్తి అలవారచుకోవాలన్నారు. విద్యార్థులలో నిద్రాణమైన సృజనాత్మక శక్తిని వెలికితీయడములో గురువుల పాత్ర కీలకమైనదని అది గుర్తించి విద్యార్థులను సరైన రంగం వైపు మార్గదర్శనము చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పోలా వెంకట రమణారెడ్డి ,ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య నాయుడు ,భారత పురావస్తూ శాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, కోర్టు సిబ్బంది రమేష్, వెంకటేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ ను కళాశాల ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు.

దిగుబడి లేక కేపీ ఉల్లి రైతు విలవిల..

నష్టాల పాలు అవుతున్న ఉల్లి రైతులు

దువ్వూరు, జనవరి 07, ప్రభాతవార్త:

మండలంలో కేపీ ఉల్లి సాగు పంట ఈ ఏడాది రైతులకు శాపంగా మారిందని చెప్పవచ్చు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, ప్రభుత్వ తోడ్పాటు లేకపోవడంతో కేపీ ఉల్లి రైతులు దిగుబడి లేక నష్టాల పాలు అవుతున్నారు. వివరాల్లోకి వెళితే..దువ్వూరు మండలంలో దువ్వూరు, మూడిళ్ల పల్లె, నీలాపురం, మదిరేపల్లె, చిన్న సింగనపల్లె, చల్లబసాయి పల్లె గ్రామాల్లో సుమారు 2వేల ఎకారాల్లో కేపీ ఉల్లి పంటను సాగు చేశారు. ప్రస్తుతం కేపీ ఉల్లి పంట దిగుబడి చేతికి వస్తుంది. ఈ పంటకు విదేశాల్లో మంచి గిరాకి ఉంటుంది. ఇక్కడి నుండి ధాయిలాండ్ సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ ఏడాది కేపీ ఉల్లి పంట దిగుబడి నామమాత్రంగా ఉంది. ఎకరాకు 80వేల రూపాయలు పెట్టుబడిపెట్టి సాగు చేశారు. 50క్వింటాల్లు రావాల్సిన దిగుబడి కనీసం 8క్వింటాల్లు కూడ రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తెగుళ్ల బారిన పడి పూర్తిగా దిగుబడులు తగ్గిపోయాయి. మైదుకూరు నియోజికవర్గంలో కేపీ ఉల్లి రైతులను వ్యాపారస్థులు సిండికేట్గా ఏర్పడి ధర, తూకాల విశయంలో కూడ కేపీ ఉల్లి రైతులను దోపిడి చేస్తున్నారు. ధర విశయంలో అయితే వారం రోజుల క్రితం క్వింటాలు 7వేల రూపాయలు ఉండగా ప్రస్తుతం 5నుంచి 6వేల మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఎక్కడైనా క్వింటాల్ వంద కేజీలు ఉంటుంది. అయితే ఉల్లి రైతుల నుండి వ్యాపారస్థులు 120కేజీలు తీసుకొని 100కేజీలకు ఇస్తున్నారు. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలను ఎంపిర చేసుకొని వ్యాపారుల్లుఅక్కడే కొనుగోలు చేస్తున్నారు. ఇతరులను రానివ్వడం లేదు. ఇటివల జరిగిన మండల సమావేశంలో కేపీ ఉల్లి రైతుల దుస్థితి గురించి మూడిళ్లపల్లె సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి సభ దృష్టికి తీసుకు వచ్చారు. కనీసం పంటల భీమా చేసుకుందామన్నా ఉల్లి పైరు జాబితాలో ఉండాలి. అలా కేపీ ఉల్లి పంట పంటల బీమా జాబితాలో లేదు. దీంతో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రతి ఏడాది కేపీ ఉల్లి పంట విదేశాలకు ఎగుమతి కావడంతో విదేశీ మాదకద్రవ్యం కూడ ప్రభుత్వానికి వస్తుంది. అటువంటి కేపీ ఉల్లి పంటను ప్రభుత్వం ప్రోత్సహించాల్సింది పోయి పట్టించుకోవడం లేదు. కేపీ ఉల్లి పంట దిగుబడి వచ్చే సమయంలో ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని. అలా ఏర్పాటుచేస్తే ప్రైవైట్ వ్యాపారుల దోపిడి తగ్గుతాయి, ధర, తూకాల విశయంలో రైతులకు న్యాయం జరుగుతోంది. ఈ విధంగా ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని మైదుకూరులో ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. పంట దిగుబడి లేని సమయంలో ప్రభుత్వం ఆదుకునే విధంగా ప్రణాళికలు తయారు చేస్తే కేపి ఉల్లి రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేపీ ఉల్లి రైతులు కోరుతున్నారు.

లోక్ అదాలత్ రాజీ పత్రాలపై కక్షిదారుల ఫోటోలు తప్పనిసరి

(న్యాయవాది సంతకాలను కూడా నిశితంగా పరిశీలించాలి)... (మోసాల నేపథ్యంలో రాష్ట్ర లోక్ అదాలత్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ)

బద్వేలు లీగల్, డిశంబరు 07 ప్రభాతవార్త :

లోక్ అదాలత్‌ల ద్వారా రాజీపడదగ్గ వివాదాల పరిష్కారాల విషయములో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం కీలక ఉత్తర్వులను జారీ చేసింది. లోక్ అదాలత్‌లను ఆశ్రయిస్తున్న కక్షిదారుల్లో కొందరు మోసపూరితంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇకపై రాజీపడి వచ్చే ఇరువైపులా గల కక్షిదారుల ఫోటోలను రాజీ పత్రాలపై విధిగా అతికించాలని లోక్ అదాలత్ ఛైర్మెన్‌లకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సుస్పష్టం చేసింది. అలాగే కేసుల రాజీ కోసం లోక్ అదాలత్ ముందు హాజరయ్యే న్యాయవాది ట్రయల్ కోర్టులో వకాలత్ వేసిన వారు ఒకరా లేక వేర్వేరా అని నిశితంగా పరిశీలించాలని కూడా వ్యాఖ్యానించింది. లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కారానికి వకాలత్‌లో వున్న న్యాయవాది హాజరు కానపుడు, అందుబాటులో లేనపుడు రాజీ పత్రంపై సంతకాలు చేసే కక్షిదారులు సరైన వారా, కాదా అని నిర్ధారించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవచ్చని లోక్ అదాలత్‌లకు స్పష్టం చేసింది. నేషనల్ లోక్ అదాలత్ నిబంధనలు -2009 ప్రకారం రాజీ పిటీషన్‌లపై కక్షిదారులు వారి తరుపున హాజరయ్యే న్యాయవాదుల సంతకాలు కూడా తప్పనిసరి అని గుర్తు చేస్తూ అలా సంతకాలు చేయకుండా జారీ చేసే అవార్డులు చెల్లనేరవని పేర్కొనింది. ఓ కేసులో లోక్ అదాలత్ ముందు రాజీ పత్రంపై పిటీషనరు యొక్క తండ్రి తరుపున న్యాయవాది చేసిన సంతకం ట్రయల్ కోర్టులో వకాలత్ వేసిన న్యాయవాది సంతకం ఒకటిగా లేదని పేర్కొంటూ పిటీషనరు తండ్రి ఆయన తరుపు న్యాయవాది సంతకం లేకుండా లోక్ అదాలత్ అవార్డు జారీ చేయడాన్ని రద్దు చేస్తున్నట్లు న్యాయస్థానం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ నూనేపల్లి హరినాథ్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇటీవల వెలువరించింది. వివరాలలోకి వెళితే... గుంటూరు జిల్లా తెనాలి మండలానికి చెందిన పుల్లారావు ఆస్తుల పంపకంలో ముగ్గురు కుమారుల్లోని పెద్ద కుమారుడు తెనాలి కోర్టులో 2003 నందు దావా వేసి వివాదాన్ని రాజీ మార్గంలో పరిష్కరించుకుంటామని లోక్ అదాలత్‌కు పంపించాలని అభ్యర్థించడంతో తెనాలి మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మెన్ వద్దకు చేరింది. ఆస్తి మొత్తం తన పెద్ద కుమారునికే చెందుతుందని తండ్రి పుల్లారావు అంగీకరించినట్లు పేరొకంటూ లోక్ అదాలత్ అవార్డు జారీ చేసింది. ఈ అవార్డును అప్పీలు చేస్తూ పుల్లారావు రెండవ కుమారుడు గతేడాది మార్చిలో హైకోర్టులో వ్యాజ్యము దాఖలు చేయగా పూర్వాపరాలను విచారించినంతట లోక్ అదాలత్ వద్ద కాంప్రమైజ్ పిటీషన్‌లో తన తండ్రి, ఆయన తరుపు న్యాయవాది సంతకం చేయలేదన్నారు. ఈ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం లోక్ అదాలత్‌చే జారీ చేయబడిన అవార్డును రద్దు చేస్తూ ఈ తీర్పును వెలువరించి రాజీ పత్రాలలో ఇరు పక్షాల కక్షిదారుల ఫోటోలు అతికించడం తప్పనిసరి అని మరో మారు తెలియజేసింది.

దేవాలయ భూముల సమస్యలపై ఎమ్మార్వోకు వినతి

చిట్వేలి,జనవరి 7, ప్రభాతవార్త :

చిట్వేలి గ్రామ పరిధిలోని పలు దేవాలయాల భూముల సమస్యలను పరిష్కరించాలని మండల తాసిల్దార్‌కు అర్చకులు వినతిపత్రం అందించారు. మంగళవారం స్థానిక సచివాలయం పరిధిలో ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దేవాలయ భూములు సరిహద్దులు, ఈ పాస్ బుక్ సంబంధిత సమస్యల గూర్చి తాసిల్దార్ మోహన్ కృష్ణకు అర్చకులు అరవింద్ శర్మ, స్థానిక యువత సమస్యలను విన్నవించారు. శ్రీకృష్ణదేవరాయల సామంతులైన మట్లి రాజులు సుమారు 500 సంవత్సరాల క్రితం రాయలు వారి ఆడపడుచు కంచి రాణి గుర్తుగా వరదరాజస్వామి (విష్ణుకంచి) మరియు శ్రీ సోమేశ్వర స్వామి(శివకంచి) తో పాటు శ్రీఆంజనేయ స్వామి, శ్రీవీరభద్ర స్వామి ఆలయాలను నిర్మించారు. దేవాలయ ధూపదీప నైవేద్యాలకు మట్లిరాజులు సోమేశ్వర స్వామికి 14.63 ఎకరాలు వరదరాజ స్వామికి 23.42 ఎకరాలు, వీరభద్ర స్వామికి 7.00 ఎకరాల భూములను చేకూర్చారు. దేవాదాయ శాఖ సంబంధిత భూములను నాము మాత్రము రుసుముతో మూడు సంవత్సరాల వ్యవధితో కౌలుసాగుకు వేలం నిర్వహిస్తూ ఉంది. కాగా ఈ భూములకు సంబంధించి సరిహద్దులు ఏర్పాటు గాని, ఈ పాసుబుక్కుల మంజూరు కానీ లేకపోవడం బాధాకరవిషయమని స్థానిక అర్చకులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే లక్షల్లో ధరల పలుకుతూ కోట్లు విలువ చేసే ఈ భూములు పలువురి ఆక్రమించి ఉండటం విశేషం. బ్రాహ్మణ వీధిలోని ఆంజనేయ స్వామి గుడికి సంబంధించి రెవిన్యూ రికార్డుల్లో ఎకరా 29 సెంట్లు ఉన్నప్పటికీ 36 సెంట్లు భూమి దేవాదాయ శాఖ రికార్డుల్లో లేకపోవడం దురదృష్టకరం. గుడి నిర్మాణాల స్తల వివరాల, భూముల సరిహద్దులు పర్యవేక్షించి రక్షించవలసిన అధికారులు మిన్న కుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓట్లు విలువచేసే దేవాలయ భూములను రక్షించి హిందూ ధర్మ

పరిరక్షణకై ఆలయాల జీర్ణోద్దారణకు ఉపయోగపడే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు వాపోతున్నారు.కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గురు ప్రసాద్, స్థానిక యువత నరసింహ, వెంకటేశు పాల్గొన్నారు.

ఆలయ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం:

ఈ విషయం పై జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథం మాట్లాడుతూ సిబ్బంది కొరత తో పర్యవేక్షణ ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వ రెవెన్యూ సదస్సుల ద్వారా ఆలయ భూముల ఇబ్బందులను రెవెన్యూ అధికారులకు విన్నవిస్తున్నామన్నారు. త్వరితగతిన ఆలయ భూములకు వన్ బి,అడంగల్ సేవలను కల్పించేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. ఆలయ ఆస్తుల ఆక్రమణలను సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువు తీరిన కౌలు రైతులు రుసుము చెల్లించి గడువు పొడిగించుకోవాలన్నారు. పటిష్టమైన ప్రణాళికతో ఆలయ భూముల పరిరక్షణకు సత్వర చర్యలు తీసుకుంటామని ప్రభాతవార్తతో తెలిపారు.

వైసిపి పాలనలో వేల ఎకరాలు స్వాహా

పులివెందుల, జనవరి 7, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలోని వేల ఎకరాల ప్రభుత్వ భూములు, దేవస్థాన, పోరంబోకు, నాలుగవ తరగతి ఉద్యోగులకు ఇచ్చిన భూములు వైసిపి నాయకుల అండదండలతోనే స్వాహా చేశారని భూ కబ్జాలను చేసి పేదవారికి అన్యాయం చేశారని కబ్జా చేసిన భూములను తిరిగి మళ్లీ ప్రభుత్వ పరం చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధి రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2024 వరకు పులివెందుల పట్టణంలో వందల ఎకరాల భూములు కబ్జాలకు గురయ్యాయని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు పులివెందుల పట్టణంలోని రంగనాథ స్వామి ఆలయ భూములను ఆక్రమించి భవంతులను నిర్మించారన్నారు. పక్కన ఉన్న రెండు ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేసి రంగనాథ స్వామికి చెందినటువంటి భూములను కబ్జా చేసి క్రయవిక్రయాలను జరిపి అందులో భవంతులను నిర్మించారన్నారు. అధికారులు వెంటనే వీటిపై తగిన చర్యలు తీసుకోకపోతే వీటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లి ఆక్రమణదారుల నుంచి విడిపించి రంగనాథ స్వామి ఆలయానికి అప్పగిస్తామన్నారు. అంతే కాకుండా పట్టణంతో పాటు కె.వేలమవారి పల్లి, ఎర్రగుడిపల్లి ,తదితర ప్రాంతాలలో వందల ఎకరాల భూములను వైసీపీకి చెందిన కొంతమంది ఆక్రమించారని ఆయన పేర్కొన్నారు. పేదల భూములను ప్రభుత్వ స్థలాలను వంకలను వాగులను కూడా కబ్జాదారులు వదలకుండా భూ కబ్జాలు చేశారని ఫలితంగా కోట్ల రూపాయలు అర్జించి నేడు పేద ప్రజలపైనే వారు ఉక్కు పాదం మోపుతున్నారని ఇలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ము

ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి పులివెందులలోని భూ కబ్జాలపై సంపూర్ణంగా నివేదికను అందించి కబ్జా జరిగిన ప్రతి భూమిని కబ్జాదారుల నుంచి విడిపించి పేద ప్రజలకు అప్పగిస్తామన్నారు. నేడు పేదలకు కనీసం ఒక్క సెంటు భూమి ఇచ్చేదానికి కూడా పులివెందుల పట్టణంలో భూమిని లేకుండా ఆక్రమించారని ఇదంతా వైసీపీ నాయకుల అండదండలతోనే జరిగిందని అన్నారు.

దేవాదాయ శాఖ భూముల ఆక్రమిస్తే చర్యలు తప్పవు

**తంబళ్లపల్లె జనవరి 7 ప్రభాతవార్త ఃఃః

జార్జ్‌క్లబ్‌పై రాజకీయాలు తగదు

ప్రొద్దుటూరు జనవరి 7 ప్రభాతవార్త

పట్టణంలో విభిన్న సేవలందించడంలో 115 ఏళ్ల చరిత్ర గల జార్జి క్లబ్‌పై రాజకీయాలు చేయడం తగదని జార్జ్‌క్లబ్ సెక్రటరీ పురుషోత్తంరెడ్డి, క్లబ్ మెంబర్ రిటైర్డ్ ఏఎస్ఐ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జార్జ్ క్లబ్ లో వారు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరు జార్జ్ కారొనేషన్ క్లబ్‌కి దాదాపు 115 సంవత్సరాల చరిత్ర వుందని, జిల్లాలోని పలువురు రాజకీయ ప్రముఖులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఈ క్లబ్ లో సభ్యులని వివరించారు. అంతేకాకుండా ఎన్నో రకాల క్రీడా పోటీలు సేవా కార్యక్రమాలు చేసిన ఘనత జాతి క్లబ్‌కు ఉందన్నారు. కేవలం పేకాట ఐదు శాతమేనని దాన్ని రాజకీయం చేయడం భావ్యం కాదన్నారు. ఇక్కడ జూదం నిర్వహణ కోసం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఎస్పీ అనుమతి కోరారని మాజీ ఎమ్మెల్యే తెలపడం పూర్తి అవాస్తవమని స్పష్టం చేశారు. తామే స్వయంగా క్లబ్ పూర్వ వైభవం కోసం ఎమ్మెల్యేను ఈ విషయమై కలిశామని, ఆయన కేవలం ఎస్పీ అనుమతి ఇస్తేనే ఆడాలని తెలిపారే కానీ అధికార పార్టీ ఎమ్మెల్యే గా మద్దతు నిలవలేదని, ఆదివారం జూదం జరిగితే, సోమవారం ఎమ్మెల్యే ఎస్పీ అనుమతి లేని కారణంగా నిలిపి వేయాలని తెలిపారని వివరించారు. ఎమ్మెల్యే నంద్యాల

వరదరాజులరెడ్డి అసాంఘిక కార్యక్రమాలు ఏనాడూ ప్రోత్సహించరనే విషయం మాజీ ఎమ్మెల్యేకు తెలియదా అన్నారు. జార్జ్‌క్లబ్ నుంచి వచ్చే ఆదాయం నుండి ఛారిటీ కూడా నిర్వహిస్తున్నామని వివరించారు. జార్జ్ క్లబ్ పైన రాజకీయాలు చేయాలని చూడటం సరైన పద్ధతి కాదన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గెలుపుకు కూడా జార్జ్‌క్లబ్ సభ్యులు కృషి చేసిన విషయం గుర్తించాలని రిటైర్డ్ ఎస్సై శివశంకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లుతోపాటు ఆయన తండ్రి కూడా క్లబ్బులో సభ్యులుగా ఉన్నారని గుర్తు చేశారు. ఇకనైనా జార్జ్‌క్లబ్ విషయంలో రాజకీయాలు చేయరాదని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జార్జ్‌క్లబ్ సభ్యులు హరిహర ప్రసాద్, అడ్వకేట్ శివ చంద్రారెడ్డి, రామకృష్ణ, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వాల్మీకిపురం జనవరి 07 ప్రభాతవార్త ః

మండలంలోని చింతపర్తి పంచాయతీలో కొలువైన 700 సంవత్సరాల నాటి పురాతన ఆలయమైన ఓబులేశ్వరుని కొండపై ఈ నెల 10వ తేదిన ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయప్రధాన అర్చకులు విద్యా సాగర్ శర్మ మంగళవారం ఒక ప్రకటణలో తెలిపారు ఇప్పటికే కొండపై వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లును పూర్తిచేశామన్నారు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి కొండపై వైకుంఠవాకలి దర్శనం ఉంటుందన్నారు. అలాగే 11వ తేది శనివారం ద్వాదశి రోజున కూడా వైకుంఠవాకలి దర్శనం ఉంటుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వాల్మీకిపురం పట్టణంలోని శ్రీ లక్ష్మీకామేశ్వరస్వామి ఆలయం, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు తితిదే ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరామాలయంలో వైకుంఠ ఏకాదశివేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు ఇక్కడ ద్వాదశి రోజు శనివారం రోజున వైకుంఠ వాకలి దర్శనం భక్తులకు కలగనుంది.

మోడీ గోబ్యాక్ అంటూ సిపిఎం నిరసనలు

మదనపల్లె, జనవరి 7 ప్రభాతవార్త :

రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధానమంత్రి గోబ్యాక్ అంటూ సిపిఎం మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను రూ.20వేల కోట్లు పెట్టుబడి అంచనాతో 20లక్షల టన్నుల సామర్థ్యంతో ప్రత్యక్షంగా 25వేలు, పరోక్షంగా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పదేళ్ళ క్రితం చెప్పిన బిజెపి ఇప్పుడు కడప ఉక్కు పరిశ్రమ పరిశీలనలో లేదని చేతులెత్తేసిందన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వకుండా మోసం చేసిన మోడీ గోబ్యాక్ అంటూ తెలిపారు. బుధవారం 8న వైజాగ్‌లో జరిగే మోడీ పర్యటనను అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిశర్మ, నాగరాజు, నరసింహా, జయబాబు, శ్రీరాములు, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు వీల్‌ఛైర్ పంపిణీ

మదనపల్లె, జనవరి 7 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి మంగళవారం వికలాంగులకు వీల్‌చైర్, చెక్క కర్రలను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి క్రిష్ణకిశోర్ ఆదేశాల మేరకు చిప్పిలిలో నివాసం ఉంటున్న రమణమ్మ అనే దివ్యాంగురాలికి వీల్‌చైర్‌ను అందించడం జరిగిందన్నారు. అదే విధంగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు కురబలకోటలో నివాసం ఉంటున్న బాబాపకృద్దిన్ అనే దివ్యాంగునికి వీల్‌చైర్‌ను అందించడం జరిగిందన్నారు. బి.కొత్తకోట ఓబులేసుకు చెక్కకర్రలను ఇవ్వడం జరిగిందన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషిచేద్దాం

మదనపల్లె, జనవరి 7 ప్రభాతవార్త :

హిందూమతంలో తారతమ్యాలు, కులబేధాలు లేకుండా విబేధాలు వదలిపెట్టి హిందూజాతిని ఏకతాటిపైకి తెచ్చేందుకు ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని అఖండ నవభారత్ నిర్మాణ్ అధ్యక్షులు నారదరెడ్డి అన్నారు. మంగళశారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5న విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం విజయవంతం కావడంపై హిందూ బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఏపిలో జరిగిన కార్యక్రమం హిందూ బంధువులందరి ఐక్యతను చాటిందన్నారు. తిరుపతిలో టిటిడికి చెందిన భూములు ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఆయోధ్యశ్రీరామాలయం, ఇస్కాన్ ఆలయాలు, స్వయం ప్రతిపత్తితో నిర్వహిస్తున్నారన్నారు. కులాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంగళ్ళులో కూటమి సమావేశం

కురబలకోట, జనవరి 7 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కూటమి ప్రభుత్వం తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు అందరూ నేడు అంగళ్ళులో సమావేశం నిర్వహించనున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి వైజి.సురేంద్ర తెలిపారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ దాసరపల్లె జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కెఎన్ఎం కోల్డుస్టోరేజ్ వద్ద ఉదయం 10గంటలకు కూటమి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కురబలకోట సింగిల్‌విండో అధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్‌నడింపల్లెలో రెవెన్యూ సదస్సు

రామసముద్రం, జనవరి 7 ప్రభాతవార్త :

మండలంలోని ఆర్‌నడింపల్లి పంచాయితీలో మంగళవారం తహశీల్దార్ నిర్మాలాదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించాలని, ఆధారాలు ఉన్న వాటిని త్వరగా పరిష్కారంచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఆర్ఐ మండలసర్వయర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం

వాల్మీకిపురం, జనవరి 07 ప్రభాతవార్త ః

ఇంటర్మీయిట్ టూర్లో భాగంగా పర్యటనలు, పరిశీలనలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సామార్థం పెరుగుతుందని, తద్వారా కొత్త విషయాలను తెలుసుకుని నైపుణ్యాలను పెంచుకుని విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు మార్గం సుగమనం అవుతుందని మండల విద్యాధికారి వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఒకేషనల్ కోర్సులో భాగంగా మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రాన్ని సందర్శించి, ఎంఈవోతో మమేకమై అక్కడ ఉన్న వెబ్సైట్ను పరిశీలించి కొత్త కొత్త విషయాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ఎంఈవో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి, విద్యార్థులపై ప్రశ్నలు సంధించి జవాబులను రాబట్టారు. తెలియని విషయాలను విద్యార్థినిలకు తెలియ జేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు సర్పంచులకు తాత్కాలిక చెక్ పవర్ నిలిపివేత

వీరబల్లి, జనవరి 7, ప్రభాతవార్త;

మండలంలోని సానేపాయి,వంగిమళ్ళ సర్పంచ్‌ల చెక్ పవర్ ను తాత్కాలిక నిలిపివేస్తూ జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఉత్తర్వులు అందాయి. రెండు గ్రామాలలో పంచాయతీ నిధులు దుర్వినియోగం పాల్పడ్డారని పలువురు ఫిర్యాదులు చేయడంతో డియల్ఓ మస్తాన్వలి విచారణ చేపట్టారు. విచారణలో నిధులు దుర్వినియోగం అయినట్లు విచారణలో తేలడంతో. డిపిఓ. బాలకృష్ణ రెడ్డిలు చెక్ పవర్ ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వీరబల్లి ఎంపీడీవో కార్యాలయానికి. ఫిర్యాదుదారులకు ఉత్తర్వులు అందజేశారు ఈ ఉత్తర్వులు ప్రకారం తాత్కాలికంగా సర్పంచ్ చెక్ పవర్ లో రద్దు అయ్యాయి. సానేపాయికి చెందిన టిడిపి నాయకులు జానసేన నాయకులు. గుగ్గిళ్ళ వెంకటేశులు. నంగిమళ్ళ పంచాయతీలో కల్లూరు ప్రతాపరెడ్డిలో ఫిర్యాదు చేసిన వారి లో ఉన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో నూర్జహాన్ వివరణ అడగగా సనేపాయ, వంగిమాళ్ళ పంచాయతీలకు సర్పంచులు చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు వచ్చిన మాట వాస్తవమే అన్నారు.

హెచ్ఎంపివి వైరస్‌పై ముందస్తు జాగ్రత్తలు

తంబళ్లపల్లె జనవరి 7 ప్రభాతవార్త ః

దేశంలోని పలు రాష్ట్రాలలో హెచ్ఎం పివి వైరస్ కేసులు నమోదైన దృశ్య స్థానిక ప్రజలు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజస్వి, డాక్టర్ రీచర్డ్ లు తెలిపారు. మంగళవారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ఎం పివి వైరస్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. కరోనా వైరస్ తరహాలోనే ఈ హెచ్ఎంపివీ వైరస్ లక్షణాలు ఉంటాయని దగ్గు, జలుబు, జ్వరం, నీరసం వస్తాయని చెప్పారు. మనిషిలో వ్యాధినిరోధక శక్తి తక్కువ ఉన్న వారిని ఈ వైరస్ సోకే ప్రమాదం ఉందని ముందస్తుగా ప్రతి ఒక్కరు మాస్కు ధరించాలని, గుంపులు గుంపులుగా ఉన్నచోట జాగ్రత్తగా వ్యవహరించాలని, తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, శానిటైజర్ కచ్చితంగా వాడాలని వ్యాధి లక్షణాలున్న వారు వెంటనే ఆసుపత్రిని సందర్శించి తగు వైద్య చికిత్సలు పొందాలని సూచించారు. ఈ విషయమై ఆసుపత్రిలో రోగులకు మార్క్ డ్రిల్ నిర్వహించి పలువురికి మాస్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ గ్లోరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో రోడ్డు ప్రమాదం

ప్రొద్దుటూరు, జనవరి 7, ప్రభాతవార్త

ప్రొద్దుటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళితే ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు నందు శ్రీ చైతన్య విద్యా సంస్థలకు చెందిన స్కూల్ బస్సు పల్సర్ బైక్‌లో వస్తున్న అబ్దుల్ మునాఫ్ అనే కార్పెంటర్ వృత్తి చేసుకుంటున్న 26 సంవత్సరాల వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అబ్దుల్ మునాప్ ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు కు రెఫర్ చేశారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియ రావలసి ఉంది. ఈ విషయమై రూరల్ ఎస్సై మహ్మద్ రఫీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాజకీయాల్లో నైతిక విలువలు ఉండాలి

లక్కిరెడ్డిపల్లి ; జనవరి 07, ప్రభాత వార్త

ప్రజాస్వామ్యంలో తాను నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే ఆర్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు లక్కిరెడ్డిపల్లి మండలం లోని తన స్వగృహంలో మంగళవారం రామాపురం మండలం రాచపల్లె పంచాయతీ గంగనేర్ క్వార్టర్స్ కు చెందిన గాలివీటి నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి రమేష్ కుమార్ రెడ్డి ని దుశ్యాలవాలతో సన్మానించి పూలమాలలు పుష్ప గుచ్చాలు అందజేశారు అనంతరం భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు అందజేశారు తనపై ప్రేమ అభిమానాలతో నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు తాను రుణపడి ఉంటానని వారిని నా కుటుంబ సభ్యులుగా భావిస్తానని రమేష్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా కార్యకర్తలకు తెలియజేశారు తాము అధికారంలో ఉన్న లేకపోయినా నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు వారి కష్టనష్టాల్లో పాలుపంచుకుంటానని రమేష్ కుమార్ రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

అమరవీర జవానుల త్యాగాలను విస్మరించటం తగదు

కడప కార్పొరేషన్, జనవరి 7 ప్రభాతవార్త:

భారతదేశ కోసం శత్రు దేశాలతో పోరాడి అసువులు బాపిన అమరవీర జవానుల జ్ఞాపకార్థం నగరంలోని ఎర్రముక్కపల్లి కూడలిలో ఉన్నా వార్ మెమోరియల్ స్థూపాన్ని తొలగించడం తగదని కడప జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె వి. రావు అన్నారు. ఆ స్థలంలో వేరే చిహ్నాలను తొలగించి తక్షణమే వార్ మెమోరియల్ స్థూపాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కడప జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎండి రజాక్ ఖాన్ ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ దేశ భవిత కోసం శత్రు దేశాలతో పోరాడి ప్రాణత్యాగం చేసి అసువులు బాసిన వీర జవహనులకు గౌరవార్థం వార్ మెమోరియల్ స్తూపాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సైనిక సంక్షేమ అధికారి ఎండి. రజాక్ ఖాన్ స్పందిస్తూ జిల్లా కలెక్టర్, కార్పొరేషన్‌ల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అమరవీరుల స్తూపం ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పుల్లయ్య నాయుడు, సభ్యులు కే ఓబులేసు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎస్సార్ పాలెంలో రెవెన్యూ సదస్సు

పుల్లంపేట: డిసెంబర్ 7 (ప్రభాతవార్త)

పుల్లంపేట మండలం ఎస్ ఆర్ పాలెం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును తాసిల్దార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగిందని ఇన్స్పెక్టర్ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ హాజరు కావడం జరిగిందని వివరించారు. ఈ సదస్సులో మొత్తం 71 దరఖాస్తుల వచ్చాయని అందులో రెవెన్యూ 33 రేషన్ కార్డులకు 5 దేవాదాయ శాఖ ఒకటి హౌసింగ్ 23 ఎంపీడీవో రెండు సర్వే మూడు పెన్షన్‌కి సంబంధించిన నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేయర్ శ్రీరాములు రెవెన్యూ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నట్లు ఆయనతెలిపారు.

ఏవోపై దాడి, కేసు నమోదు

వీరబల్లి, జనవరి 07, ప్రభాత వార్త:

మండలంలోని పెద్దవీడు గ్రామ పంచాయతీ రావిమని దిన్నేపల్లి కు చెందిన గాలి నరసింహులు కేంద్ర ప్రభుత్వం నుంచి అందే పిఎం కిసాన్ (రైతు భరోసా) డబ్బులు పడలేదని తనను అవమానపరిచి విధులకు ఆటంకం కలిగించి అసభ్యంగా ప్రవర్తించాడని ఏవో స్వాతి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై మోహన్ నాయక్ తెలిపారు.

అర్జీలకు గడువులోపు పరిష్కారాలు

పీలేరు జనవరి 07 ప్రభాతవార్త ః

గ్రామీణ ప్రజల నుంచి అందిన సమస్యల అర్జీల పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. మండలంలోని అగ్రహారం, ఎర్రగుంటపల్లి గ్రామ పంచాయతీల రెవెన్యూ సదస్సును మంగళవారం అగ్రహారం పంచాయతీ ఎల్లలవారిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు తమ తమ భూ సమస్యలు, ఇతర సమస్యలకు పరిష్కారం కోరుతూ తహశీల్దారుకు వినతులు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది సదస్సులో అందిన అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్ సైట్‌లో నమోదు చేసి వాటికి రసీదులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యర్రగుంటపల్లి, అగ్రహారం పంచాయతీల కూటమి నాయకులు, టిడిపి పీలేరు మండల మాజీ అధ్యక్షులు నాగప్పగారి అమర్నాథ్ రెడ్డి, ఎర్రగుంటపల్లి నాయకులు, పీలేరు మండల తెదేపా ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, దినచంద్రారెడ్డి, ప్రభాకర రాజు, రెడ్డిశేఖర, అగ్రహారం గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రాజుతో పాటు సర్వేయర్ కిరణ్మయి, అగ్రహారం విఆర్ఓ ఇమ్రాన పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ అభివృద్ధి టిడిపి తోనే సాధ్యం

కడప కార్పొరేషన్, జనవరి 7 ప్రభాతవార్త:

నాయి బ్రాహ్మణుల అభివృద్ధి టిడిపి తోనే సాధ్యమని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం అన్నారు. కడప నూర్జహాన్ కళ్యాణ్ మండపంలో నాయి బ్రాహ్మణుల జిల్లా అధ్యక్షుడు గురుస్వామి ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఐపీఎస్ రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం మాట్లాడుతూ 1989లో మాజీ సీఎం నందమూరి తారక రామారావు నాయి బ్రాహ్మణ ఫెడరేషన్ స్థాపించి తద్వారా కుల వృత్తిని ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఫెడరేషన్ ను అప్‌గ్రేడ్ సీఎం చంద్రబాబు చేశారని చెప్పారు. నాయి బ్రాహ్మణ కులం క్షోరవృత్తి, నాదం వంటి కలల ద్వారా కులానికి గౌర ప్రఖ్యాతలు దక్కయన్నారు. కార్పొరేషన్ ద్వారా విదేశీ విద్యకు పది లక్షల రూపాయలు తోపాటు ఉన్నత విద్యకు తోడ్పాటున అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నాయకులు టీటీడీ బోర్డు మెంబర్ వైద్యం శాంతారాం కే సురేంద్రబాబు, శ్రీకాంత్, కనకారావు, జిల్లా నాయకులు రంగయ్య, బీసీ సుబ్బరాయుడు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

చైతన్య సభను విజయవంతం చేయండి

పీలేరు జనవరి 07 ప్రభాతవార్త ః

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 12వ తేది ఆదివారం మదనపల్లెలో నిర్వహిస్తున్న "కుల దహనం" కుల నిర్మూలన చైతన్య సభను జయప్రదం చేయాలని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కో కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో బాస్ నేతలతో కలిసి పాలకుంట శ్రీనివాసులు కుల దహనం కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యను వ్యూహాత్మకంగా జరిలం చేసి మాల మాదిగలు ఒకరిపై మరొకరు కత్తులు నూరుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో 12న కుల దహనం పేరుతో కుల నిర్మూలనా చైతన్య సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, నాయకులు పల్లెపోగు హరినాథ, ఎర్రబెల్లి మల్లికార్జున, ముల్లంగి గురవయ్య, రామకృష్ణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐటీ శాఖ మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పెద్దమండెం జనవరి 7 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని గిరిజన తండాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ నాయక్ విన్నవించారు. టిడిపి కార్యకర్తలపై ఇబ్బందులకు గురి చేసి వారిపై కేసులను బలాయించే చాలా ఇబ్బందులు పెట్టారన్నారు ప్రస్తుత ప్రభుత్వంలో సీనియర్ నాయకులకు న్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గంలో గిరిజనుల సమస్యలను తమ దృష్టికి తీసుకెళ్లే సమస్యలను సానుకూలంగా స్పందించి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తామని రైతులకు కార్యకర్తలకు ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు మనోహర్ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పుల్లంపేట, జనవరి 7 ప్రభాతవార్త:

గత పాలకుల అనాలోచిత పాలన వల్ల ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్ తెలియజేశారు. మంగళవారం మండలం ఎస్ఆర్‌పాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులలో లక్షలాదిగా వైసీపీ బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. బీడు, పోడు, కొండలు, గుట్టలు వంకలు, స్మశానాలు అన్న తేడా లేకుండా గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు బరితెగించి కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం ఆ సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూ బాధితులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్, ఆర్ ఐ, మండల సర్వేయర్, విఆర్ఓ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

కడప కార్పొరేషన్ జనవరి 7 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కడప శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరిపాలన అధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర అతిథిగృహంలో సంక్రాంతి సంబరాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు

గ్రామీణ స్థాయి మహిళలలో క్రీడా నైపుణ్యం వెలికి తీయాలి

ప్రొద్దుటూరు జనవరి 7 ప్రభాతవార్త

గ్రామీణ స్థాయిలో మహిళా క్రీడాకారులలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ గంగయ్య పేర్కొన్నారు. మంగళవారం భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర, వికశిత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహిళా కబడ్డీ పోటీలను స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే కబడ్డీ పోటీలు మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థులు చదువులలోనే కాకుండా ఆటల పోటీలలో భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. మాజీ టిటిడి బోర్డు సభ్యులు చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ ఆటల పోటీలు నిత్యం మానవ జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు జిల్లా వ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి పోటీలలో గెలుపు ఓటమిని సరి సమానంగా స్వీకరించి ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ వైద్యులు వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలోని మహిళా క్రీడాకారిణులకు ఇలాంటి వేదికలు చక్కటి అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హరితరెడ్డి మాట్లాడుతూ మహిళలకు జిల్లాస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నెహ్రూ యువ కేంద్రం నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి ఆటల కార్యక్రమాలను మహిళలకు నిర్వహించేందుకు ప్రభుత్వము ముందుకు రావాలని కోరారు. అనంతరం గెలుపొందిన వారికి చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు, ట్రోఫీలు ప్రధానం చేశారు. మొదటి బహుమతి ఆర్‌సిపిఈటి కాలేజీ గెలుచుకోగా రెండవ బహుమతి కడప డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ టీం మూడవ బహుమతి సిఎస్ఎస్ఆర్ కాలేజ్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో వికశిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి, సుబ్బయ్య చేతన ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రాజేశ్వరమ్మ 70వ జన్మదిన వేడుకలు

స్థానిక కందుల విద్యా సంస్థల కరస్పాండెంట్ శ్రీమతి కందుల రాజేశ్వరీ 70 వ జన్మదిన వేడుకలు కెయస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీలోని కెఓర్ ఆడిటోరియంలో సాంస్కృతిక మరియు కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛైర్మన్ మదన్ మోహన్ రెడ్డీ గారు మాట్లాడుతూ KSRM ఇంజనీరింగ్ కళాశాల(A), KLM మహిళా ఇంజనీరింగ్ కళాశాల యొక్క కరస్పాండెంట్‌గా, కందుల ఒబుల రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ యొక్క ఉపాధ్యక్షురాలు మరియు కోశాధికారిగా సేవలందిస్తూ, సంస్థలకు డైరెక్టర్‌గా పనిచేస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు, సేవా తత్పరత కలిగిన మనిషిగా కడప జిల్లాలోని అనేక ఆలయాల నిర్మాణానికి లక్షలాది రూపాయలు విరాళంగా అందించారు, వందలాది విద్యార్థులకు విద్యా స్కాలర్‌షిప్ లను అందించారు అనీ తెలియ చేస్తూ, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, కెయస్ఆర్ఎం కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ అధ్యాపక మరియు బోధనేతర సిబ్బంది, సమాజం పట్ల మీ నిబద్ధత, సేవా తత్పరత చిరస్మరణీయం అన్నారు. సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా, సామరస్య వాతావరణాన్ని పెంపొందించే నాయకత్వం, సమాజం పట్ల మీ ఔదార్యం, పరోపకార గుణం ఎంతో మంది జీవితాలను స్పృశించి అనీ ఈ శుభ సందర్భంగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ, మీరు దీర్ఘాయుష్మంతులై ఇలాగే సమాజ సేవ చేస్తూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాం అనీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ లోనీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్‌ప్రసాద్, వివిధ విభాగాల డీన్ లు, విభాగాధిపతిలు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పుత్తా రామచంద్రయ్య

సిద్దవటం, జనవరి 7, ప్రభాతవార్త:

సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియోజకవర్గ సీనియర్ నాయకులు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య పేరు దాదాపు ఖరారు అయినట్లు సమాచారం. ఆయన ఎంపికకు రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు సుధా దుర్గాప్రసాద్, కూటమిలోని కీలక నేతల అండదండలు పుత్తా రామచంద్రయ్యకు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రెండు మండలాల్లో అలుపెరగని పోరాటం చేసిన రామచంద్రయ్యకు ప్రాధాన్యత ఇచ్చిన అధిష్టానం సంక్రాంతి తరువాత అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

జాతీయ స్థాయి ఖురాస్ పోటీలలో నలంద విద్యార్థి విజయం

సిద్దవటం, జనవరి 7, ప్రభాతవార్త:

68వ నేషనల్ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఖురాస్ పోటీలలో శ్రీనలంద విద్యార్థి విజయం సాధించారని పాఠశాల ఇన్‌ఛార్జి అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వం విద్యార్థులకు విద్యతో పాటు శారీరకంగా పిల్లల అభివృద్ధి చెందాలనే దృక్పథంతో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీలలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలల్లో స్థానిక నలంద పాఠశాల నుంచి 68వ నేషనల్ స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జనవరి 2వ తేదీ నుంచి 6వ వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఖురాస్ పోటీలలో అండర్-17 విభాగంలో 10వ తరగతికి చెందిన బాలుగారి శ్రీశాంక్ జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి సాధించారని వారు తెలిపారు. అండర్-19 స్కూలు గేమ్స్ జిల్లా కార్యదర్శి శారద అలాగే అండర్-17 స్కూలు గేమ్స్ జిల్లా కార్యదర్శి అరుణకుమారి అలాగే స్కూలు గేమ్స్ కార్యదర్శి సుబ్బరాజులు, జిల్లా శిక్షకులు మురళీకృష్ణారెడ్డి అభినందించారు. అలాగే ఈ విద్యార్థికి శిక్షకులుగా ఫిజికల్ డైరెక్టర్ వెంకటేష్ శిక్షణ అందించారని వారు తెలిపారు. ఈ విద్యార్థిని మండల విద్యాశాఖాధికారులు విలియం రాజు, అరుణలు అలాగే పాఠశాల కరస్పాండెంట్ బాలు గారి వెంకట సుబ్బయ్య, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారని వారు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

దువ్వూరు, జనవరి 07, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జరిగిన ఆశా, ఆరోగ్య సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి నెల 5కాన్పులు జరిగే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. కాన్పుల సంఖ్య పెంచాలని పేర్కొన్నారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ తరపున జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, వికసిత, హేమలత, రోశిణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్, వైద్య సిబ్బంది రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రజోత్సవ వేడుకలు ప్రారంభం

రాజంపేట అర్బన్, జనవరి7 ప్రభాతవార్త

సామాజిక అభివృద్ధి కోసం ,గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యాభివృద్ధి కోసం అన్నమాచార్య యూనివర్సిటీ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. అన్నమాచార్య యూనివర్సిటీ లో మంగళవారం సిల్వర్ జుబ్లీ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమై య్యాయి.అన్నమాచార్య యూనివర్సిటీలో విద్యా సాంకేతిక రంగాలలో 25 సంవత్సరాలలో చేసిన అద్భుతమైన ప్రయాణాన్ని, దాని విలువైన కృషి గురించి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల విజయం ఈ సంస్థ యొక్క వారసత్వానికి కీర్తిని జోడిస్తుందని అన్నారు. ముఖ్య అతిథి రాజంపేట ఎమ్మెల్యే ఆకే పాటి అమర్నాథ్ రెడ్డి రాజంపేటలోని ఏఐటీఎస్ 25 సంవత్సరాల ప్రయాణం విద్యార్థుల జీవితాలను మార్చడంలో, పురోగతిని పెంపొందించడంలో విద్య యొక్క శక్తికి నిదర్శనంగా నిలిచిందని కొనియాడారు.అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ చొప్పా అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ మైలురాయి 25 సంవత్సరాల కృషికి అంకితభావం, దార్శనికతకు నిదర్శనమన్నారు. విద్యార్థుల విజయకేతనాలు ఈ సంస్థయొక్క గొప్పతనాన్ని చాటుతాయని తెలిపారు. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ సి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏఐటీఎస్ కు నాణ్యమైన విద్యలో బెంచ్ మార్కును నెలకొల్పడం తోపాటు సామాజిక అభివృద్ధికి దోహదపడే నాయకులను సృష్టించిందని ఈ సంస్థ యొక్క విశిష్టతను ప్రశంసించారు. రాజంపేట డీఎస్పీ కె సుధాకర్ ప్రసంగిస్తూ అకడమిక్స్ లో రాణించాలని, దేశాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ .మల్లికార్జున రావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ బి జయరామిరెడ్డి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ ఎం సుబ్బారావు, డీన్స్, హెచ్ఓడీలు, అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవితమ్మను కలిసిన తెదేపా నేతలు

పులివెందుల, జనవరి 7, ప్రభాతవార్త :

పులివెందుల టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి, తెదేపా నాయకులు సారెడ్డి గంగాధర్ రెడ్డి లు మంగళవారం విజయవాడలో క్యాంపు కార్యాలయంలో మంత్రి కలిశారు. సారెడ్డి గంగాధర్ రెడ్డి కుమారుడు నటింప చేసి వ్యవసాయం అనే ఒక లఘు చిత్రం నిర్మించారు. కథా చిత్రానికి సంబంధించిన పోస్టర్ ను చూపించారు. అలాగే ఈనెల 15వ తేదీన మంత్రి జన్మది నం సందర్భంగా వ్యవసాయం సంబంధించి యూట్యూబ్ లఘు చిత్రాన్ని ప్రారంభించాలని కోరారు. దీనికి సంబంధించి ప్రారంభిస్తానని హామీ ఇచ్చారని దీనితో ఈ 15వ తేదీన పెనుగొండలో వ్యవసాయంపై తీసిన యూట్యూబ్ లఘు చిత్రాన్ని మంత్రి చే ప్రారంభించడం జరుగుతుందని సారెడ్డిగంగాధర్ రెడ్డి తెలిపారు. అలాగే మంత్రి కూడా ఈ మేరకు వ్యవసాయం సంబంధించి ఒక మంచి ఆల్బమ్ చేయడం చాలా బాగుందని రైతులకు వ్యవసాయం సంబంధించి ఈ ఆల్బమ్ లో ఉపయోగపడేలాగా ఉండడం మంచి విషయమని సారెడ్డిగంగాధర్ రెడ్డి అభినందించారు.

సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

చాపాడు, జనవరి 07, ప్రభాతవార్త:

గ్రామాలలో సంక్రాంతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మంగళవారం అల్లాడుపల్లి దేవస్థానం వీరభద్ర స్వామి అన్నదాన సత్రం నందు సంక్రాంతి పండుగకు సంబంధించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ రోజులలో డీజే, ఆర్కెస్ట్రా, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లకు అనుమతి లేదన్నారు. కోడి పందాలు, జూదం వంటి అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎన్, ఇంద్రప్రస్థ వెంచర్స్ మేనేజింగ్ డైరెక్టర్ పెరుగు వీరనారాయణ యాదవ్, బద్రిపల్లె టీడీపీ నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, దేవస్థానం మాజీ చైర్మెన్ వీరారెడ్డి, అర్చకులు, దేవస్థాణ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఢీకొన్న కారు

గోపవరం, జనవరి 7 ప్రభాత వార్త:

బద్వేలు నెల్లూరు జాతీయ ప్రధాన రహదారిపై మంగళవారం ఓ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే ఒంగోలు నుండి తాడిపత్రికి ఓ పనిపై ఈశ్వర్ రెడ్డి దంపతులు కారులో వెళ్తుండగా మండలంలోని శ్రీనివాసపురం సమీపంలోని ద్వారకా క్రషర్ వద్ద అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. కారు, ఈ ఘటనలో విద్యుత్ స్తంభం రెండు ముక్కలుగా తెలియ పడింది. అలాగే కారు పుర్తిగా ధ్వంసం అయింది. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ప్రాణాపాయం చెప్పింది. స్థానికులు 108 ద్వారా వారిని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

మంచు కురిసే వేళలో

రాయచోటి జనవరి 7 ప్రభాత వార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని పలుచోట్ల మంచు కప్పుకుపోవడంతో ఉదయం పూట పొలాల వద్దకు వెళ్లే రైతులు పట్టణాల్లోని పలు చోట్ల పలు రకాల పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ మంచు తెల్లవారుజామునుండి 8 గంటల వరకు కప్పుకపోవడంతో మదనపల్లి రోడ్డు చిత్తూరు రోడ్డు పూర్తిస్థాయిగా మంచుతో కప్పబడిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించకపోవడంతో వాహనదారులు కాస్త ఇబ్బందులకు కూడా గురవుతున్నట్లు తెలుస్తోంది మంచు తో పాటు విపరీతంగా చలి కూడా ఉందని పలువురు చెప్తున్నారు. ఏది ఏమైనా అంతటి మంచు ఏనాడు లేదని రోజు రోజుకు మంచు తీవ్రత ఎక్కువగా ఉందని పట్టణ వాసులు కూడా తెలుపుతున్నారు. మరికొందరైతే మంచులో వెళుతూ వెళుతూ మంచు కురిసే వేళలో అంటూ వాకింగ్‌కి వెళ్లే ప్రతి ఒక్కరు చెప్పుకుంటూ వెళ్తున్నారు.

మోలిక సదుపాయాలు కల్పించాలి

రాయచోటి జనవరి 7 ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీకి కనీస మోలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట మహిళలతో కలిసి నిరసన తెలియజేశారు అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ కి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్ది గాళ్ళ శ్రీనివాసులు మాట్లాడుతూ 2008 సంవత్సరంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరమ్మ కాలనీ మంజూరు చేశారు కానీ 16 సంవత్సరాలు గడుస్నా ఎటువంటి కనీస మోలిక సదుపాయాలకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు గత పాలకులు మాత్రం వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులకు తాగునీటి సౌకర్యం కల్పించామని హంగు ఆర్భాటంగా ప్రచారం చేశారే తప్ప ఆచరణలో ఎక్కడ సాధ్యం కాలేదు ఎందుకు నిదర్శనం ఇందిరమ్మ కాలనీ అన్నారు ఇప్పటికే 500 కుటుంబా నివసిస్తున్న అందులో దాదాపు 150 మంది చిన్న పిల్లలు ఉన్న కనీసం అంగన్వాడి కేంద్రం గానీ ఆరోగ్య ఉప కేంద్రము సీసీ రోడ్లులు డ్రైనేజీ వ్యవస్థ వీధి దీపాలు వెలిగల్లు ప్రాజెక్టు పైపులైను ద్వారా తాగునీటి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి టీవీ సుదర్శన్ సిపిఐ నాయకులు కే ఓబులేసు పి అంజి మహిళలు రమాదేవి లక్ష్మి అమరావతి తదితరులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి పర్యటనలో ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 7 ప్రభాతవార్త :

ఉమ్మడి చిత్తూరుజిల్లా కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. మంగళవారం కుప్పంలో ముఖ్యమంత్రి నిర్వహించిన స్వర్ణకుప్పం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పరిశ్రమలు, పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, అధునాతన సాంకేతిక కార్యక్రమాల ప్రదర్శన, బిందుసేధ్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట ఎమ్మెల్యే పాల్గొన్నారు. మూడురోజులు పాటు ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం ముఖ్యమంత్రి కుప్పం నుంచి విశాఖ పట్టణానికి బయలుదేరినట్లు తెలిపారు.

ధనుర్మాసంలో హనుమంతునికి విశేష పూజలు

బద్వేల్ అర్బన్ జనవరి 07 ప్రభాతవార్త :

ధనుర్మాసం పురస్కరించుకొని మంగళవారం సిద్ధవటం రోడ్డులో వెలిసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో తెల్లవారుజామునుండే ఆలయ అర్చకులు హరిస్వామి ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, సింధూరం అర్చన, ఆకు పూజ తో పాటు పలు రకాల విశేష పూజలను వైభవంగా నిర్వహించడం జరిగింది, స్వామివారికి ఆకు పూజ కార్యక్రమాన్ని యోగివేమన యూనివర్సిటీ ఈసీ నెంబర్ కొండపల్లి చిన్న సుబ్బారావు సతీమణి దేవి ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు వారి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారి ప్రసాదాలను అందజేయడం జరిగింది, ధనుర్మాసం పురస్కరించుకొని పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు, ఆలయానికి వచ్చిన భక్తాదులందరకు ఆలయ నిర్వాహకులు వ్నల్ల కొండు వెంకటరమణ ఆలయ మేనేజర్ మాడపూరు వెంకటరమణ ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేయడం జరిగింది.

రాత్రివేళ్లలో అత్యవసర కేసులను మాత్రమే రెఫర్ చేయండి

మదనపల్లెక్రైం, జనవరి 7 ప్రభాతవార్త :

అత్యవసర కేసులను మాత్రమే మదనపల్లె ఆసుపత్రి నుంచి తిరుపతికి రెఫర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ కోటేశ్వరికి విన్నవించారు. మంగళవారం 108 సూపర్‌వైజర్ నాగభూషణం అధ్వర్యంలో సిబ్బంది సూపరింటెండెంట్‌ను కలిశారు. ఆదివారం రాత్రి అరోగ్యంగా వున్న రోగిని రెఫర్ పెట్టడంతో అతన్ని తిరుపతికి తీసుకెళ్లే సమయంలో పొగమంచు ఎక్కువగా వుండటంతో 108 వాహనం ఢీకొని ముగ్గురు మృతిచెందటం విధితమే. వీలైనంతవరకూ రాత్రి వెళ్లలో ఎటువంటి కేసులను తిరుపతికి రెఫర్ చేయవద్దని, అత్యవసర కేసులను మాత్రమే పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ వైద్యులతో మాట్లాడి రెఫర్ కేసులను తగ్గిలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ షాకూర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డును పిచ్చి మొక్కలు ఆక్రమించాయి

గుర్రంకొండ, జనవరి 7, ప్రభాతవార్త

మర్రిమాకులపల్లి క్రాస్ నుండీ రంగప్పగారిపల్లి రోడ్డును పిచ్చి మొక్కలు ఆక్రమించాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా వుండే ఈ రోడ్డును సగం రోడ్డును ఆక్రమించాయి, అయితే రోడ్లు, భవనాలశాఖాధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈరోడ్డు మలుపులు కూడా అధికంగా వుండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారుగా ఈ రోడ్డును దివంగత ప్రధానమంత్రి అటల్‌బిహారి వాజ్‌పేయి గ్రామ సడక్ యోజన క్రింద 20 సంవత్సరాల క్రితం రోడ్డును వేయడం జరిగింది. ఈ రోడ్డు గుండా బస్సులు కూడా పోవు. ఆటోల ప్రభావం ఎక్కువగా వుండడంతో బస్సును నిలుపుదల చేశారు. అయితే ఇక్కడ ప్రజాప్రతినిధులు కూడా అంతంతమాత్రం కావడంతో పట్టించుకొనే నాదులు కరువయ్యారు. దీంతో వాహనాల ప్రమాదాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా వున్న పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డును శుభ్రపరచాలని స్థానికులు కోరుతున్నారు.

జూస్‌కి కిలో రెండు రూపాయలే

గుర్రంకొండ, జనవరి 7, ప్రభాతవార్త

టమోటాలు పండించిన అన్నదాతలు జూస్ వాహనాలకోసం ఎదురుచూస్తున్నారు. జూస్‌కి కిలో రెండు రూపాయలు పెట్టి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈ రేటుకైనా సకాలానికి అందుబాటులో వుంటే తోటల దగ్గరే కోసి ఇస్తామని రైతులు రోదిస్తున్నారు. టమోటా తోటలకు భీమా సౌకర్యం లేకపోవడం శాపంగా మారింది. టమాటాల సాగు జూదంలా మారింది. లక్షలు పెట్టుబడి పెట్టడం పెట్టుబడికోసం ఎదురు చూడడం ఆనవాయితీగా మారింది. టమోటాకు ప్రత్యామ్నాయపంటలు సాగు చేయరు. వస్తే లక్షల్లో వస్తది పోతే నష్టాలపాలు చేస్తది. దీంతో రైతులు స్థానిక టమోటా మార్కెట్‌యార్డుకు కాయలు తోలకుండా తోటల దగ్గరే జూస్ వ్యాపారులకు అమ్మేయడం జరుతుంది. దీంతో వ్యాపారులు చేసేదేమిలేక 30 కిలోల బాక్సు రూ. 60 లకే అమ్మాల్సి వస్తుంది. గతంలో మంచి టమోటాలను మార్కెట్‌యార్డుకు పంపించి సైజు తక్కువ వున్న కాయలను జూస్‌కు అమ్మేవారు అయితే ప్రస్తుతం యార్డులో కూడా రేట్లు బాక్సు రూ. 100 పలుకుతుండడంతో జాక్‌పాట్‌లు, బర్తీలు, కమీషన్, కూలీలు, బాక్సుకు బాడుగలు కలిపి చేతి గుండా పడుతుందని గ్రహించిన రైతులు తోటల దగ్గరే బొలెరో వాహనాల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. తోటలలో కాయలు వుండడం చూడలేక కూలీలు అయినా వస్తే చాలని పెట్టుబడి కథ దేడుడెరుగు అని కోతలు పెట్టి విక్రయిస్తున్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

గాలివీడు, జనవరి 7(ప్రభాతవార్త):

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన మేనేజింగ్ డైరెక్టర్ రా జబాబు గృహ నిర్మాణ అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం మం డలంలోని గుర్రాలమిట్ట సమీపంలో గృహ నిర్మాణా లేఅవుట్లను కలెక్టర్‌తో కలి సి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని లేఅ వుట్లలో ఇంకా గృహ నిర్మాణాలు పూర్తి కాలేదని, లబ్దిదారులతో మాట్లాడి వీటి ని పూర్తి చేయించేటట్లు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేఅవుట్లలో విద్యు త్, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభు త్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసు కురావాలని ఆయన అధికారులకు తెలిపారు. అనంతరం ఇంటి లబ్దిదారుల గృ హాలకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇం టి నిర్మాణానికి కేటాయించిన నిధులు చాలడం లేదని అందువల్ల అప్పులు చేసి గృహ నిర్మాణాలను పూర్తి చేయాల్సిన పరిస్థితి వస్తున్నదని లబ్దిదారులు హౌ సింగ్ ఎండీ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గృహనిర్మాణాలు పూర్తయినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదని లబ్దిదారులు అధికారుల దృష్టికి తీసు కువెళ్లారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయడం జరుగు తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నార